# వెలుగులేని మెఱుపు

రచన :
శ్రీ దివ్యప్రభాకర్.

"చాల్లేవే, స్కూల్ ఫైనల్‌తోనే ఆపేద్దామంటే నా మాటవిన్నావూ? పెద్దచదువు, పెద్దచదువని నెత్తికి కుంపట తెచ్చావ్! హు!" అని రమణయ్యగారు నిట్టూర్చారు. భర్తమాటలకి ఆవిడ మాట్లాడకుండా ఊరుకుంది. తప్పు తనదేననే సందేహం ఆమెకు ఈ నాటికీ కలగలేదు. అయినా సందర్భవశాన యేర్పడుతున్న క్లిష్టపరిస్థితులు చూస్తూ మౌనాన్ని తప్ప మరేమీ ఆయుధంగా ఉపయోగించగల శక్తి ఆమెకి లేదు.

ఉన్నకాస్తభూమినీ స్వంత వ్యవసాయం చేసినన్నినాళ్లూ ఏ అవస్తలూ, ఆపదలూ లేకుండా సంసారం సవ్యంగా, సుఖంగా సాగి పోయింది. రమణయ్య గారు పక్షవాతం పడ్డ యీ రెండేళ్లనుంచీ అన్నివిధాలా కష్టాలనే ఎదుర్కొటోంది కుటుంబం. ఆడంబరాలకు వెళ్లకుండా భేషజాలు పోకుండా గుట్టుమట్టుగా నెట్టుకొచ్చిన తాను ఏఇబ్బందులవల్ల పదిమంది దగ్గరా చెయ్యి జాచ వలసి వస్తుందోనని ఆయన అనుక్షణం వ్యథతో కుములుతూండే వారు. ఆయనకి తోచిన సాయం నలుగురికీ చెయ్యటం తెలుసు గానీ యాచించటం ఏనాడూ వంశాన లేని మచ్చ. బ్రతుకులు పతనమైన వెంటనే అభిమానం అంతరిస్తుందనుకోడం అవివేకం అభిమానం అడ్డుతగిలి కష్టాలను ఇనుమడింపజెయ్యటం సహజం. సుఖాన్ని ఆహ్వానించినంత సుముఖంగానూ, ఆనందంగానూ కష్టాల్నీ, దుఃఖాల్నీ ఆప్యాయంగా ఆహ్వానించి అనుభవించటం సాధారణ మానవులకు అతీత కార్యం మహాత్ములకే అది సహజం!

పక్షవాతం ఆరంభమైన కొద్ది కాలానికే రమణయ్యగారు కూతురి వివాహాన్ని తలపెట్టారు. ఆస్తులు కావాలని అపేక్ష పడక పోయినా అంతఃకరణ మంచిదైతే చాలునని తృప్తి పడ్డారు. కట్నాలు పెట్టగల సమర్థతకూడా ఆయనకు లేదని అందరికీ తెలిసిన విషయమే!

గౌరవాలు లోటుగావున్నాయని పెళ్లివారు ఎంత సణిగినా ఆయిన అప్పుమాత్రం అయిదు వందలూ కనిపించకపోలేదు. ఈ అప్పులభారంతో మూల్గుతూండగానే సుబ్బారావు స్కూలు ఫైనలు ప్యాసు కావడం కాలేజీ చదువుకు పట్నంపంపమని తల్లీ కొడుకులు పోరు పెట్టడం జరిగింది.

"దాన్ని మనం భరించలేమే"! అని రమణయ్యగారు ఎంత మొత్తుకుంటున్నా, 'పదిమందిపిల్లలున్నారా' అనీ ఏమైనా సరే చదవాల్సిందే ననీ తల్లీ సుబ్బారావూ మొండికేశారు.

రమణయ్య గారు భార్య కష్ట సుఖాలూ, సంసార బాధ్యతా తెలియని అమాయకురాలు కాదు. కానీ ఒక్కడే మొగబిడ్డ కావటంవల్ల వాడు పెద్ద చదువు చదివి, పెద్ద ఉద్యోగంచేస్తూంటే హాయిగా కూర్చుని తినాలనీ ఆ ఉద్యోగపు హోదా కొంత వరకూ తనకూ ప్రాప్తిస్తుందనీ ఆవిడ నమ్మకం. కన్న బిడ్డలు అవిశ్వాసాన్ని ప్రదర్శిస్తారే అనే విషయం ఆమె ఊహకందనిది.

అన్నీ తెలిసిన భార్య కూడా సుబ్బారావుని పట్నం పంపటానికే నిశ్చయిస్తే రమణయ్యగారు మాట్లాడ లేక పోయారు. చివరికి ఆయేటి పంటంతా అమ్మేసి సుబ్బారావుని పట్నంలో కాలేజీకి పంపటం, అప్పులాళ్ల వాక్శూలాలకు గురికావటం తప్పలేదు.

'కానున్న కాక మానదు' అని దైవంమీద భారం వేసి మంచంలో మూలుగుతూ పడుకోవలసి వచ్చింది రమణయ్యగారు.

సుబ్బారావు కాలేజీ చదువు ప్రారంభించి సంవత్సరంకావచ్చింది. ఉత్తరాలు ఎప్పుడూ వస్తూనే ఉండేవి. క్షేమ సమాచారాలు వ్రాసుకునీ, డబ్బు పంపమనీ చేబదుళ్లు చెయ్యటం పది మందినీ అడగటం మాత్రం తప్పలేదు. అయినా అసంగతులు లేమీ రమణయ్యగారు పట్టించుకోనట్టు మెలిగే వారు.

"పట్నం చదువంటే మాటలతోడనా? కాలు కదిపితే డబ్బు కావాలి. పైగా పెద్ద చదువు!" అంటుండేది భార్య రమణయ్యగారు రూపాయల్ని మింగే ఈ విద్యా యంత్రాన్ని చూసి బెదిరిపోయారు. కానీ ఈ పదుల్నీ, వందల్నీ మింగుతున్నది చదువు కానే కాద

నీ, సుబ్బారావు చేతికి, ఎముక లేమి పూర్తిగా కారణమనీ గుర్తించటానికి ఆయనకి ఎక్కువ కాలం పట్టలేదు. ఆయన ఆవేదనా పూరిత హృదయులై క్రుంగిపోసాగారు.

సుబ్బారావు ఇంత వివేక శూన్యంగా, తమ గృహ పరిస్థితుల్ని విస్మరించి ప్రవర్తిస్తాడని ఆయన ఊహించనైనా లేదు ఎన్నడూను. ఒక్కగా నొక్క కొడుకు ఆశలన్నీ వాడిమీదే! భవిష్యత్తులో సంసార భారం వహించి తనకోసం కష్టించిన తండ్రిని ఉద్ధరిస్తాడనే నమ్మకం ఈ దుష్ప్రవర్తనతో అంతరించసాగింది.

చాటుగా తల్లి కొడుక్కి ఉత్తరం వ్రాసింది పరిస్థితులన్నీ సింహావలోకనంచేస్తూ దానికి జవాబుగా పట్నం బ్రతుకూ, అక్కడి ఖర్చులూ, స్నేహితులూ, హోదాలూ...అన్నీ, అసలు సత్యాన్ని మరుగు పరుస్తూ వచ్చింది. తల్లి కొడుకును విశ్వసించకుండా ఉండలేక పోయింది. 'పల్లెలో, ఇక్కడ కూర్చుని 'చదువు' ను గురించి ఉపన్యాసాలు దంచటమంత సులభమైంది కాదు ఆ చదువు' అనేదే సత్యమని నమ్మింది.

వీరయ్య ఈ యేట పంట అమ్మటానికి పట్నం వెళ్లి వచ్చాడు. అతను రమణయ్యగారి పొలాన్ని కట్టుబడికి తీసుకున్న రైతు. అతనికి కొంత స్వంత పొలంకూడా వుంది. ప్రపంచం తీరు తెలిసిన వ్యక్తి. ఆలోచనాపరుడు. వ్యవసాయంచేస్తున్నా చదువు మీద భక్తీ, ఆసక్తీ ఎక్కువ. మిల్లులో లెక్కతీసుకుని సరాసరి రమణయ్యగారి ఇంటికే వచ్చాడు.

గుమ్మంలో కూ మంటూ "ఎట్టావుంది బాబు ఒంట్లో?" అన్నాడు పరామర్శగా.

"రావయ్యా! మంచి తీర్థంకావాలా?" అని ఆహ్వానించారు రమణయ్యగారు. ఆయనకి అతనంటే సద్భావం చిన్నతనంనుంచీను.

వీరయ్య నిత్య సంతోషి. కష్టాల్ని అనుభవించటం అందరికీ కష్టమే! కానీ కొందరు తమ కష్టాల్ని గోరంతలు కొండంతలుగా చేసుకుని బాధ పడతారు. కొందరు ఆ కష్టాల వల్ల కలిగే మనఃక్లేశాన్ని దూరం చేసుకొని, దానికి లొంగకుండా సాధ్యమైనంతవరకూ చిరునవ్వు చిందుతూనే వుంటారు. వీరయ్య ఈ రకం మనిషే!

"కాసిని దాహం ఇప్పించండి" అన్నాడు మెల్లిగా.

రమణయ్యగారు తన అవస్థనీ కొడుకుస్థితినీ వివరించేందుకు ఉపోద్ఘాతం మొదలు పెట్టారు. భార్య వీరయ్యకి మంచినీళ్లు తెస్తూ "ఎందు కొచ్చినసోది అదంతానూ? కూడుపెట్టేదా, గుడ్డ ఇచ్చేదా!" అంది విసుగుదల సూచించే గొంతులో.

వీరయ్యకి నవ్వుతూ "మీకు తెలీదమ్మా! లోపలి బాధ ఎవళ్లకన్నా చెప్పుకుంటేగానీ తగ్గదు" అన్నాడు. ఈ సత్యాన్ని అతను తన ఘస్టుఘారం చదివిన విజ్ఞానం వల్ల సంపాదించింది కానే కాదు.

"చూడు వీరయ్యా! మీ వాడూ పట్నంలోనే చదువుతున్నాడు గదా! ఏమాత్రం పంపిస్తున్నావు నువ్వు?" అన్నారు రమణయ్యగారు.

వీరయ్య క్షణంసేపు వృద్ధుడిముఖంలోకి చూస్తూ వుండిపోయాడు. తరవాత అందుకుని మాటమారుస్తూ "ఆఁ! మిల్లునుంచి లెక్క తెచ్చాను" అన్నాడు. తమ సంభాషణ రమణయ్యగారి భార్యకి ఏ మాత్రం రుచించనట్టు ముఖాన్ని విముఖంగా మార్చటమే అతను మాట మార్చటానికి కూడా కారణం. "తీసుకోండి" అని బొడ్డులోంచి పైకం తియ్యబోతున్నాడు.

"నేను తీసుకుని మాత్రం చేసేదేముంది? బాకీ కింద జమకట్టరా! ఉందిగా మన పాలిట బ్యాంకీ!" అని రమణయ్యగారు మంచంలో అటు తిరిగి పడుకున్నారు.

అందుకు సీతమ్మగారు వెంటనే అంకుకుని "వాడేమె డబ్బు అవసరమని ఉత్తం రాసి వారం అయిపోయె! ఆ సంగతి ఆలోచించరేం? వీరయ్యా! ముందు దాంట్లో వాడికి ఓ వంద మనియార్డరు కట్టేయ్" అంది.

"అవును, ఆ పని చెయ్యి. అసలు ఆ డబ్బంతా వాడికే పంపితే సార్థకమౌతుంది కూడాను. తరవాత నువ్వూ నేనూ అడుక్కుతిన్నా బాధ వుండదు శరీరాల్లో పటుత్వవున్నవాళ్లమాయెను!" అని కడుపు మంట పట్టలేక ఉద్రేకంతో మంచంలో అటు ఇటూ తిరిగారు రమణయ్యగారు.

వీరయ్య జాలిగా, దయావీక్షణాలు ఆయన వంక ప్రసరింప జేశాడు. సీతమ్మగారు మ్లానవదనంతో మిన్నకుంది.

"సరే! మీ యిష్టం. మనియార్డరే ముందు కట్టేస్తాను. డబ్బుకి ఇబ్బంది పడుతున్నానని ఆయనగారు రాయనే రాసారు" అంటూ వీరయ్యా లేచాడు.

"సరే ఏదోచెయ్యి దానిష్ట మొచ్చినట్టే చెయ్యి. ఏటి పొడుగునా సంసారాన్ని నడుపురుని రావలసిన భాధ్యత దానికి మాత్రం తెలీదూ? ఏమంటావు వీరయ్యా?" అన్నారాయన.

వీరయ్యా తలపంకించి సమాధానం చెప్పకుండా గుమ్మం దిగి పోస్టాఫీసు కేసి నడిచాడు.

* * *

పట్నంలో వున్న సుబ్బారావుకి మర్నాడు వంద రూపాయలు మనియార్డరుతో పాటు ఒక ఉత్తరం కూడా అందింది. దాంట్లో ఇలావుంది.

"అబ్బాయిగారికి! నమస్కారాలు క్షేమంగా, బాగా చదువుతున్నారని తలుస్తాను. మీతోబాటు అక్కడ మావాడు కూడా వుంటున్న సంగతి మీకు తెలిసిన సంగతే! మీకూ, మీ చదువుకే సంతృప్తిగా సరిపడేంత డబ్బును పంపటానికి మీ కున్న ఆస్థి వివరాలూ, మీనాన్నగారి ఆరోగ్య స్థితి ఎలా వున్నదీ మీకు తెలుసు. అయినా మీరు పట్నంలో చదువు ప్రారంభించిన దగ్గర్నుంచీ ఏదో విధంగా ఓ పూట తినీ, ఓ పూట తినకా కూడా మీకు కష్టంకలగని విధంగా పంపుతూనే వున్నారు. గడిచిన సంవత్సరంలో మీ ఖర్చులన్నీ లెక్క వేస్తే ఏ కాలేజీ విద్యార్థి అంతకంటె ఎక్కువ ఖర్చు చేసి వుంటాడనే నమ్మకం నాకు లేదు.

బాబుగారూ! మీకు కోపంవస్తే నన్ను చెయ్యగలది ఏమీలేదు. మీ పొలం కట్టుబడి వదులుకోమంటారు. అందువల్ల నాకు కలిగే నష్టం కంటే అభిమానంవున్న ఓ వ్యక్తి దారితప్పితే తెలియచెయ్యటం వల్ల కలిగే లాభమే ఎక్కువనేది నిర్ణయించుకున్న తరువాతే యీ జాబు వ్రాయడం జరిగింది.

నిరుటి మీ ఖర్చులో మూడవ వంతు మాత్రం నేను మా వాడికిపంపించాను. ఎలాగడుపుకుంటున్నాడో మీకు తెలియదేమో! నేను మా వాడిని గురించి గొప్పగా వ్రాస్తున్నానని నన్ను నిందించకండి. తెలిసిన విషయాన్ని నిర్భయంగా చెప్పాను.



పేప్రిన్

దెబ్బలు, కురుపు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖ వ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. క్రొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతియింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

¼ ఔ. సీసా అణాలు 9. ½ ఔ. సీసా రూపాలు 1/-

హాలేరిన

అతిసారానికి, జిగట, రక్త విరోచనాలకి
అద్భుతమైన ఔషధం.

అతిసారం. జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్లవచ్చిన జ్వరం వీటిని తగ్గించును.
అసాధ్యమైన జబ్బులన్నీ ఈమందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకెట్ 6 అణాలు.

క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.

ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాలవ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'క్యాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్‌ఫ్లుయన్‌జా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలుగల పేకెట్టు 4 అణాలు.
4 ప్యాకట్లకు తక్కువ వి. పి. లో పంపబడదు.

అన్ని షాపులలోనూ దొరకును.

ది లస్టర్ మ్యాన్యుఫాక్చరింగ్ కంపెని,
చిక్ పేట, బెంగుళూరు సిటీ.

ఇంత వరకూ మీ చదువుకి ఖర్చయిన దానితో ఇంకొక యకరం కొనే పని. ఇక్కడ నాన్నగారి పరిస్థితి రోజూ చూస్తూనే వున్నాను. మీ వంటి కొడుకును కన్నందుకు ఆయన బాధ పడుతున్నారని తెలిస్తే కూడా మీలో ఏమీ మార్పు రాదా? మీ జవాబు కోసం ఎదురు చూస్తూంటానని వేరే రాయనక్కరలేదనుకుంటాను. ఆలోచించండి...వీరయ్య”

* * *

ఉత్తరం పోస్టులో వేసివచ్చిన రాత్రి వీరయ్యకి నిద్ర పట్టలేదు. తను తొందర పడి ఉత్తరం రాయలేదు గదా! అనిపించపడసాగాడు. అయినా తనువెవరు సుబ్బారావుకి బోధ చెయ్యటానికి? ఆయన చెడి పోతే ఎవరిక్కావాలి? నాశనమైతే ఎవరిక్కావాలి? రమణయ్యగారి దీనస్థితి చూసే తను అలా చెయ్యటానికి సాహసించాడు. ఆయనకి కోపంవస్తుందేమో! రేపు రమణయ్యగారికే ఈ సంగతి తెలిసి నా బిడ్డని మందలించటానికి నీకేం అధికారముంది? అని నిలదీసి అడిగితే? వీరయ్యకి మానసికాందోళన ఎక్కువైంది. కానీ అన్నింటినీ త్రెంపుకుని, ఏదోట జరుగుతుందిలే!” అని నిద్ర పోయాడు.

ప్రొద్దున నిద్రలేచే సరికి బాగా ఎండెక్కింది. ఇంతలో పోస్టుమాన్ కేక వినబడింది “అబ్బా! అప్పుడే పది అయిందన్నమాట!” అనుకుంటూ వాకిట్లోకి వెళ్లాడు. పోస్టుమాన్ రిజిష్టర్ ఉత్తరం తీసి ఇచ్చి సంతకం చేయించుకున్నాడు.

“ఇదుగో! ఏమయ్యా! కొత్తగా వచ్చావా?” అన్నాడు అతని వంక నిశితంగా చూస్తూ. అయినా మనస్సు రిజిష్టరు కవరుమీదేవుంది. మెల్లిగాదాన్ని చింపుతూనే వున్నాడు.

“ఊ! కొత్తగానే వచ్చా! ప్రతిపనీ నేనే! ఒక్క పోస్టురు పని తప్ప! కష్టపడి పోస్టాఫీసు వేయించుకున్నారుగదా ఊళ్లో పనివాల్లు చాలరని కూడా రాయరాదూ!” అన్నాడు పోస్టుమాన్.

“ఆ పని పోస్టు మాష్టరుదేగానీ. మాకేముంది” అంటూ ఇంట్లోకెవెళ్లాడు.

మరొక అర గంటలో లాల్చీ తొడుక్కుని. పైకండువా వేసుకుని, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ మూడు మైళ్ల దూరానవున్న రైల్వేస్టేషన్ వైపుకి వెళ్లిపోతున్నాడు వీరయ్య. అతని ముఖం ఆందోళనతో ఒణుకుతోంది.

* * *

గుమ్మం అవతల చెప్పులు విడిచి లోపలికి వస్తూ ఆత్రుతగా “ప్లీడరు గారూ?” అన్నాడు వీరయ్య.

తలవంచుకుని రాసుకుంటున్న ప్లీడరుగారు మెల్లిగా తలెత్తి “ఎవరూ” అన్నారు.

“నేనండి రాఘవరావు తండ్రిని...మీ రిజిష్టరుచూసి...” వకీలుగారు వెంటనే అందుకుని “కూర్చోండి... అంతా వివరంగా వ్రాశాను. అర్థమైందిగా?” అన్నారు.

“కానీ, ఇది సాధ్యమా?” అన్నాడు వీరయ్య సందేహంగా ఆయన ముఖంలోకి చూస్తూ.

“అనుమానం ఏమీలేదు. అతని వయస్సు మీకు తెలుసుగా?” అని అడిగారు మెల్లిగా తలవంచుకుని కాయితాలు చూసుకుంటూ.

“తెలుసు ఇరవైరెండు వెళ్లిపోయింది.” వీరయ్య నిస్పృహగా అన్నాడు.

“మరింకేం? పైగా అతనికి మిమ్మల్ని అడిగితే మీరు వెంటనే ఇవ్వలేనంత మొత్తం అప్పులున్నాయి. అన్నీప్రోనోట్లే.” వకీలుగారు చావు కబురు చల్లగా చెప్పారు.

“ఆఁ! వాడికి అన్ని అప్పులున్నాయా?” ఆశ్చర్యంగానూ, దీనంగానూ అన్నాడు. మళ్లా వెంటనే అప్పులున్నాయింత అఘాయిత్యానికి దిగి, తొందర పడవలసిన అవసరం ఏముంది?” అన్నాడు.

“వాతావరణం వ్యక్తుల మనస్తత్వాలకు ప్రతిబింబం మనం మారిపోడానిక్కూడా వాతావరణమే చాలావరకూ కారణం. దానికి ఎవరు చేసేదీ ఏమీ లేదు. వ్రాతకోతలు రేపు సాయంత్రంలోపుగానే పూర్తికావాలని చెప్పాడు. అతను పుగాకు వ్యాపారస్తులతో భాగం కలుస్తాడట, పైగా అతను రిజిష్టరు మ్యారేజి చేసుకున్న అమ్మాయి త్వరపడుతోందట మీలోంచి విడిపోవాలని......”చెప్పవలసింది చెప్పేసినట్టు తనపని పూర్తి అయినట్టూ చేతులు దులుపుకుని ఊరుకున్నాడు వకీలుగారు.

“ఏమిటీ? రాఘవులు రిజిష్టరు పెళ్లిచేసుకున్నాడా? నాబిడ్డ ఇలాచేస్తున్నాడా? నిజం? ఇదినిజమేనా ప్లీడరు గారూ?” వీరయ్య బిగ్గరగా అరచినట్టే అన్నాడు బల్లమీద కూలపడుతూ “నిజమేగావున్న... సుబ్బారావే ఉత్తముడు...రమణయ్యగారే ధన్యుడు...” వీరయ్య గోడకు జార్లబడి ఏదో గొణుగుతున్నాడు.